# మాతోటలో

- నిడదవోలు మాలతి

"ఇదుగో ఇదే ఆఖరు, మరి నీ ఇష్టం" అంది అత్తయ్య అయిదోమారు మొక్క అందిస్తూ.

ఇదివరకు నాలుగు మొక్కలు ఆవిడచేత్తో ఇచ్చినవే వసురక్రమంలో భూస్థాపితం చేసేశాం. తగుమాత్రం బాద పడ్డాం కూడాను అలా జరిగినందుకు. అంచేత వెసంగిలో ఏమైనా సరే దక్షిణగాలి మా సంపెంగమొక్కమీదుగా వీచాలి అని మేం గట్టిగా నిశ్చయించుకున్నాం. ఎందుకైనా మంచిదని మాబాబు మరొకమొక్క కూడా తెచ్చాడు. రెండు కలిపి నాటాలి, ఒకవేళ ఒకటి చస్తే ఏది చచ్చిందో తెలీకుండా (రెండూ చస్తే తగువే లేదు.)

ఏదైనా మేకింగులో వున్నప్పుడు చూడకూడదు అంటుంది మా అక్క.. అందుకే కాబోలు పెద్దవాళ్లు వంటిల్లు మొగవాడు చూడకూడదు అంటారు. ఏమైనా మా "తోటపని"లో నావంతు మటుకు సూపర్విజను. ఎప్పుడైనా తోస్తే మాట సాయం చేస్తా. అంతే. గొప్పులు తవ్వడం, నీళ్లు పోయడం, పురుగు పట్టకుండా చూడడం, పట్టేక చూడడం - ఇవన్నీ అక్క వంతు. అసలు నిజానికి నాపనే కష్టం అని మా అమ్మ చెబుతూ వుంటుంది. మరి మా అక్కది కాయకష్టమూ, నాది తలతో పనీను. ఈ సందర్భంలో నేను బోలెడు కథలు చెప్పగలను. ఇప్పుడెందుకు గానీ ...

మా ఇంట్లో బొప్పాయిచెట్లు బ్రహ్మజెముడు డొంకల్లా పెరుగుతాయి మాకు ఇష్టంలేదు కనక. జామిచెట్టూ, సన్నజాజి చచ్చినా పెంచలేకపోయాం. కారణం భూసారం అంటుంది మాఅమ్మ. మా అక్క హస్తమ్మీద మా "చెడ్డ నమ్మకం" మాకు. మొత్తంమీద సంపెంగచెట్టు బాలాప్రాయంలో బాలారిష్టాలు గడిచి "నూనూగు మీసముల నూత్న యౌవనం" ప్రవేశించేసరికి అయిదేళ్లు పట్టింది. మాపక్కింటి మామయ్యగారింట్లో కొత్తగా పుట్టిన చిన్నారిపాప అక్షరాభ్యాసం చేసుకుంది. హైస్కూల్లో అల్లీబిల్లీ తిరిగిన నేను యూనివర్సిటీ స్టూడెంటునయ్యాను. మా సంపెంగ మొగ్గ తొడగలేదు. అందరూ "తొడుగుతుంది, తొడుగుతుంది" అన్నారు. స్వాతివానకి ముత్యపుచిప్పలు ఎదురు చూస్తాయంటారు. మేం మటుకు సంపెంగ మొగ్గకోసం పడ్డ వేదన అనుభవైకవేద్యం.

మేం అంటే మా ప్రియమైన సంపెంగికి దిక్పాలకులం అన్నమాట. మొక్కకి పశ్చిమాన సాయంత్రంవేళ డాబామీదా, అపరాహ్ణంవేళ ఆపక్కనే ఉన్న చిన్న కొట్టుగదిలోనూ నా స్థిరనివాసం. పోతే తూర్పుదిక్కున మా అప్పాయమ్మా, దక్షిణదిక్కున పక్కవాళ్ల అప్పాయమ్మా ఓ కన్ను వేసి వుంచారు. మొక్కకి ఉత్తరదిశన కొత్తగా అక్షరాభ్యాసం చేసుకున్న పాప నోల్ మోనార్క్. అటువేపు మేం ఎవ్వరం చూడరాదు అన్నది షరా. మొక్క తాలూకు వేరు మట్టుకు మా అక్క సంరక్షణంలో సదా వృద్ధి పొందుతోంది.

రోజు పొద్దున్నే చూసేదాన్ని అందినకొమ్మనల్లా వంచి. ఎక్కడా కనుచూపుమేరలో - అదే ఆకొమ్మ చివుళ్లలో - మొగ్గలాటిది కనిపిస్తుందేమోనని. కనిపించేది కాదు. దేముడు బొత్తిగా లేడనిపించింది ఆఖరికి. కానీ, పసిపిల్లలు ప్రత్యక్ష దేముళ్లు అంటుంది మా అమ్మ. నిజమే కాబోలు. లేకపోతే డాబామీంచి నాకు కనిపించని మొగ్గ పక్కపెరట్లో ఆపాపకెలా కనిపించింది? ఆరోజు మాయింట్లో పండుగ చేసుకున్నాం. అదే, మామొహాలు చూసినవాళ్లు అలా అనుకుంటారు.

చంద్రుడిలో మచ్చలాగ మాలో చిన్న సందేహం మెరిసింది. ఆ ఒంటరి మణిపూస ఓ ఒక్కరికి చెందాలి? అది చిటారి కొమ్మన గగనంలోకి దృష్టి సారించింది చూపరులని ఊరిస్తూ. అక్కది నిష్కామకర్మ. నాది "పుష్పవిలాపం" రచయిత మనసు. పాప మటుకు అది తన

హక్కుభుక్తములుగా భావించింది. మిగిలిన ఇద్దరు దిక్పాలకులూ - మా అప్పాయమ్మా, పక్కింటి అప్పాయమ్మా - కొంచెం ధైర్యం తక్కువరకం వాళ్లు.

“తొలిపంట దేముడికివ్వాలి“ అంటుంది మామ్మ.

“ముందసలు అది పూర్తిగా పుయ్యనియ్యండి ముందు“ అంటుంది అమ్మ.

మేం దాన్ని పుయ్యవద్దంటే కదా!

అయిదోరోజు సాయంత్రానికి మొగ్గ విడే లక్షణాలు కనిపించేయి. మామనసులు కేరింతాలు కొట్టేయి.

“అయితే దాన్ని కొయ్యడం ఎలా“ అన్నాను. పుష్పంమీద గోరానితే నా మనసు గిలగిల్లాడుతుంది అని ఇప్పటివరకూ ఎవరూ గ్రహించలేదు. కానీ ఏమైనా నా సందేహం ఓడు కాలేదు.

మర్నాడు తెల్లవారురఝామునే లేచి, స్నానాదికాలు ముగించి సంపెంగచెట్టుకింద సమావేశమయ్యాం. నేను మంచి పొడుగైన వెదురుకర్ర పందిరిలోంచి అమ్మ చూడకుండా లాగేశాను. పాప వాళ్లన్నయ్య పుస్తకాలడ్రాయరులోంచి - చోరద్రవ్యమే - తీసుకొచ్చింది. మాబాబు దొనెకర్ర తయారు చేశాడు. ఆరున్నరా, ఏడయేసరికి పొలోమని చెట్టుమీద పడ్డాం అందరం. గగనమార్గాన గాలిలో కులాసాగా ఉయ్యాలలూగుతూ ఉంటే ఆమొగ్గని పట్టుకోడం మాకు తలకు మించిన పనయింది. సగం సగం విడుతూ నీరెండలో నిగనిగలాడుతూంటే నాకు నిజంగా పష్పవిలాపం జ్ఞప్తి కొచ్చింది.

“నాది కూడా కవిహృదయమేమో“ అన్నాను సాలోచనగా, జాలిగా చూస్తూ.

అందరూ విరగబడి నవ్వేరు.

హమ్ అంటూ బాధగా మూలిగేను. అందుకే కదూ “అరసికాయ శిరసి మాలిఖ మాలిఖ“ అని మొత్తుకున్నాడు ఆయనెవరో ..

“మమ్మల్నిలా నాశనం చేస్తే మీకేమిటి లాభం?“ అన్నాయి చాకుకి తగిలి రాలిన రెండు రేకులు.

“మీబాధ నాకర్థం అయిందిలే“ అన్నాను మూకగా వాటివేపు చూస్తూ.

మొత్తమ్మీద శ్రమపడి రేకులు రేకులుగా పువ్వంతా రాలగొట్టేం. నిజానికి ఈ కిరాతకృత్యంలో నేను మనసా పాల్గొనలేదు. అంతమాత్రంచేత పువ్వు రాలగొట్టిన కీర్తిలో నా పాలు నాకు రాకుండా పోలేదు.

మర్నాడు పొద్దున్నే పాప వచ్చింది. నాకింకా నిద్రమత్తు వదల్లేదు.

“అక్కడ మూలు పూలు కాతేయి“ అంది.

మూడు! గ్లోరియస్! ″ఎక్కడ?″ అన్నాను

″మూలు కాతేయి అక్కల″ అంది చేతులు తిప్పుతూ.

″మరి మీ తపోతా తెత్తు పూతిందా?″ అన్నాను నవ్వుతూ.

″తపోతా తెత్తు పూత్తుందేమితి?″ అంది నన్ను నిలదీసి.

″అబ్బో చాలా తెలుసే″ అన్నాను అట్టే పెంచకుండా.

వారంరోజులు తిరిగేసరికి మాచంపకవృక్షం జత పువ్వులు అందించే స్థితికొచ్చింది. పంపకం నావంతు. బాగుండదని ముందురోజు మా అక్కకిచ్చేను. రెండోరోజు పాపకిచ్చాను. తరవాతి ఛాన్సు మామ్మది అంటే నిర్గుణస్వరూపుడయిన దేముడిది. పంటింట్లో దేముడిపట్టు వెనక సంసారం సాగిస్తున్న మూషికమహారాజుది. ఆతరవాత అహం బ్రహ్మస్మి.

ఆరెంజిరంగు చీరెమీద అద్దాలు కుట్టిన నల్లబ్లౌజు వేసుకున్నాను. నల్లని ముఖమల్ చెప్పులూ, కళ్లకి కాటుకా, తల్లో సంపెంగపూలు - ఒకటీ రెండూ కాదు నాలుగు పెట్టుకుని బస్సెక్కుతుంటే ఎంత గర్వంగా అనిపించిందనీ ... .. అదే అంత గర్వం కూడదు. కాకపోతే ఏమని చెప్పను? కుంజరయూధము దోమ కుత్తుక సొచ్చితే ఎలాటి ఫీలింగులు కలిగేయో నాకు తెలీదు కానీ నా సంపెంగి పూలమీద ఒక్క అమ్మాయి అయినా కామెంటు చెయ్యకపోవడం నా ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు. అంతకంటే ఘోరం డిపార్టుమెంటులో ప్యూను అడగడం.

“మీ ఇంట్లో పూసేయాండీ?” అన్నాడు మొహం చింకిచేటంత చేసుకుని.

"ఊఁ" అన్నాను మామూలుగా.

"నాకు తెచ్చియ్యరండీ?" అన్నాడు మళ్లీ అవే హాసరేఖలు మొహంమీద మెరుస్తూ.

తృళ్లిపడ్డాను. హైరోడ్ క్రాపు పెట్టించుకున్న ఒకానొక మొగజీవికి సంపెంగిపూలెందుకూ?

"నువ్వేం చేస్తావు?" అన్నాను నవ్వుతూ.

"మా పిల్లకిస్తానండీ" అన్నాడు తెగ సిగ్గు పడిపోతూ.

వెయిటింగ్ రూంలో ఆడపిల్లలందరూ ఒక్కమారు గొల్లుమన్నారు. నేనింక అక్కడ వుండడం క్షేమం కాదని మెల్లిగా జారుకున్నాను పుస్తకాలు సర్దుకుని.

ఆ సాయంత్రం ఇంటికొచ్చేసరికి అక్కచేతిలో ఓ కార్డుముక్క కనిపించింది.

"రేపు పువ్వులు కోయ్యడానికి ఆర్డర్లు లేవుట." అని పాప చెప్పింది. ఇది కొత్త అలవాటు మాయింట్లో.

"ఎందుకని?" అన్నాను కొంచెం ఆశ్చర్యపోతూ.

"మా ఫ్రెండు కలకత్తా వెళ్తోంది. స్టేషనులో కలుసుకోమని రాసింది" అంది కార్డుతో విసురుకుంటూ.

"దానికి పూలగుత్తీ వైజయంతీమాలా పట్టుకెళ్తావా?" అన్నాను హాస్యంగా.

"ఏం పట్టుకెళ్లకూడదా?" అంది లాయరులాగ.

"నాకేం. పట్టుకెళ్లు, అసలు పువ్వులు పంపించి నువ్వు మానేయ్"

"తనకి సంపెంగి అంటే చాలా ఇష్టం"

"బాగుంది. సంపెంగిపువ్వులన్నా గొడ్డుఖారం అన్నా సరదా పడనిదెవరు నేనూ అమ్మా తప్పించి" గుంటూరు ఫ్రెండుని తలుస్తూ, అమ్మని చూస్తూ.

"ఊఁ బాగుందే నీ సరసం. కల్లా కపటం లేకపోతే కన్నతల్లితో సరసం ఆడమనీ" అంది అమ్మ - మావాదోపవాదాలు పండు మిరపకాయపచ్చడిలా అనిపించి.

మెయిల్ మరో అరగంటకి వస్తుందనగా తాజాగా అప్పటికప్పుడు కోసి, తడిగుడ్డలో జాగ్రత్తగా చుట్టి పట్టుకెళ్లాం నేనూ అక్కా.

ఆకంపార్ట్‌మెంటు వాళ్లకోసం స్పెషల్‌గా వేసేరుట. చుట్టలూ, ముష్టివాళ్లూ, మురికిగుడ్డలూ - అదే చివరి బోగీ. గాంధీ ఇలాటి పెట్టెల్లోనే ప్రయాణం చేసినట్టు పెద్దవాళ్లు చెప్తుంటే చాలాసార్లు విన్నాను. అప్పట్లో థర్డు క్లాసులో ఫానులు కూడా వుండేవి కాదుట. ఎంత కష్టపడి ఉండాలో ఆలోచించు అన్నారు పైన చెప్పిన పెద్దవాళ్లు. మరి ఇలాటి సహప్రయాణీకులు ఆరోజుల్లో ఆయనకి దొరికారా ఎప్పుడయినా? నేను అడగలేదు. అలా అడగడం అవిధేయతకింద వస్తుంది కదా!

"ఈ సంపెంగిపూల వాసనలు ఈచుట్టపొగలమధ్య వింతపరిమళాలు వెదజల్లుతున్నాయి ఉగాదిపచ్చడిలాగ" అంది మాఅక్క స్నేహితురాలు.

"జీవితం అంటే అదే మరి" అంది పైగా. నిజమేననిపించింది నాకు. ఇంతటి గుణపాఠం నేర్పిన మా సంపెంగ చెట్టుకి మనసులోనే ధన్యవాదాలర్పించేను.

పదిరోజులు తిరిగేసరికి నావైపు కొమ్మలు పూత అయిపోయింది. ఇదికాదు పని అని మా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కృష్ణపరమాత్మతో చెప్పాను ముప్పై ఒక్క పువ్వులు పూస్తే నాకు పదిహేనూ ఆయనకి పదహారూ అని. ఎలాగైనా దేవుడు మంచివాడే. లంచం పుచ్చుకుని పని చెయ్యనివాళ్ల మాటేమిటి?

సరిగ్గా ముప్పై ఒక్క పువ్వులు పూయించి దేముడు దేముడిననిపించుకున్నాడు. కాని అన్ని పురాణాల్లోలాగే ఇక్కడ కూడా క్లిక్కు పెట్టేడు. గోపాలుడు ఎంతైనా గడుసువాడు. తీరా కొయ్యబోతే సరిగ్గా పదహారు పువ్వులే అందేయి.

"ఇంత 'లేని వాడివై' వున్నావేమయ్యా శ్రీకృష్ణా! నీలీలలు మాలాటి అల్పులకి అవేద్యం కదా!" అన్నాను నా పదిహేను పువ్వులూ నేను తీసుకుని, ఒక పువ్వు ఆబొమ్మముందు వుంచి. మాఅమ్మ ఉరిమి చూసింది.

నేను నాస్తికురాల్ని కానని చెప్పినా నమ్మదావిడ.

ఇంతలో డాబామీద ఏదో చప్పుడు వినిపించి గబగబా పరుగెత్తాను. అనకాపల్లి బాణాకర్రలాటి గడకర్ర ఒకటి తీసుకుని అక్క అక్కడ నిలబడి వుంది.

"మందారనూనేలో వేసుకోవచ్చు కనీసం ఒకరేకు అయినా కొయ్యగలిగితే" అంది నన్ను చూసి.

సరేనని మర కమాటు మామూలుగా పువ్వుపాళంగా కొయ్యాలని చూసేం. రాలేదు. సరే పూర్తిగా విడిపేతే మర్నాడు చెట్టు వూపి రాల్చెయ్యొచ్చు అనుకున్నాం. అదీ కుదరలేదు. పైన చెప్పిన గడకర్ర తీసుకుని గట్టిగా నెక్కాను తొడిమదగ్గర. మెల్లిగా రేకులమీద కొట్టేను ఆఖరికి గట్టిగా కొట్టేను.

"ఏమిటర్రా ఏజన్మలోనో మీరు కిరాతకులయి పుట్టినట్టున్నారు" అమ్మ కిందనించి కేకలేస్తోంది. "సంపెంగ వేడి చేస్తుంది. తలనొప్పి వస్తుంది …"

ఈరాక్షసలీలమీద ఏ కరుణశ్రీ అయినా మళ్లీ మరో పుష్పవిలాపం రాయొచ్చు.

**000**